రేపు కుమ్మర్ల తొలి బోనాలు

కుమ్మర్లు భారీగా తరలిరావాలి

రేపాక రాంబాబు, సిలివేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూలై 5: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో బోనాల పండుగ సందడి ప్రారంభం కానున్నది. దానిలో భాగంగా ఈ నెల 7వ తేదీన కుమ్మర్ల తొలి బోనాల జాతరను నిర్వహించనున్నట్లు బోనాల జాతర వ్యవస్థాపకులు రేపాక రాంబాబు, సిలివేరు వెంకటేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం నడి బొడ్డున్న ఉన్న ట్యాంక్‌బండ్ శ్రీశ్రీశ్రీ కనకాల కట్ట మైసమ్మకు ఆనవాయితీగా వస్తున్న 501 బోనాలను అమ్మవారికి నైవేధ్యంగా సమర్పించనున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఉన్న కుమ్మర్లం దరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బోనాలను బిందెల్లో కాకుండా కుండల్లో చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న అమ్మవారి దేవాలయాల్లో కుమ్మర్లనే పూజార్లుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆలయంలో పూజలు

బాలానగర్, జూలై 5 :ఫతేనగర్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీలోని కనకదుర్గదేవి, శీతలాదేవి, కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం ఆలయ పూజారి దోర్బల కాశీనాథ్‌శర్మ నేతృత్వంలో ఆలయ కమిటీ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, పసుపుబొట్టు తదితర పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భర్తను హత్య చేసిన భార్య

జగద్గిరిగుట్ట, జూలై 5: వివాహేతర సంబంధం నేపథ్యంలో తలెత్తిన గొడవలతో భార్య మరికొందరితో కలిసి భర్తను హత్య చేసింది. జగద్గిరిగుట్ట పోలీసులు శుక్రవారం నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గం నివాసి అనిల్‌కుమార్, భాగ్యలక్ష్మి దంపతులు. ప్రస్తుతం వీరు జగద్గిరిగుట్టలోని వెంకటేశ్వర కాలనీలో ఉంటున్నారు. అనిల్ అంబులెన్స్ నడిపిస్తున్నాడు. భాగ్యలక్ష్మి హోటల్ నిర్వహిస్తున్నది. అనిల్‌కుమార్ ఇటీవల మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈ విషయంలో కొద్ది కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. నిత్యం గొడవలు జరగడంతో విసిగిపోయిన భాగ్యలక్ష్మి తన హోటల్‌లో పనిచేస్తున్న మల్లేశ్, అతడి సహాయకులు నవీన్, నానీతో కలిసి అనిల్‌ను హత్య చేసేందుకు పథకం వేశారు. గతనెల 28న వీరంతా కలిసి అనిల్‌కు మద్యం తాగించారు. ఆ తర్వాత యాక్సా బ్లేడ్ సహాయంతో అనిల్ గొంతుకోసి హత్య చేశారు. ఘటన జరిగిన వెంటనే దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులను గుర్తించి విచారించారు. విచారణలో నేరం అంగీకరించడంతో నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల, జూలై 5:అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీ రోడ్ నంబర్-2లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న పటాన్‌చెరువుకు చెందిన వీరారెడ్డి(35) అనే వ్యక్తి స్థానికంగా ఐస్‌క్రీం సప్లయర్‌గా పని చేసుకుంటున్నాడు. కాగా ఇటీవల చేసుకునే పని కూడా పోవడంతో మద్యానికి బానిసై మనస్తాపానికి గురై తాను ఉంటున్న అద్దె ఇంట్లో గత రెండుమూడు రోజుల కిందట నైలాన్‌తాడుతో ఉరేసుకొని మృతి చెందాడు. కాగా, గది లోపల నుంచి దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు ఇంటి ఓనర్‌కు సమాచారం ఇవ్వడంతో తలుపులు తీసి చూడగా.. లోపల వీరారెడ్డి తాడుకు వేలాడుతూ దర్శనమిచ్చాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయనిధి పేదల ఆరోగ్యానికి భరోసా



సీఎం సహాయనిధి మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు

ఎమ్మెల్యేలు గాంధీ, కృష్ణారావు

మియాపూర్, జూలై 5: సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం సాయంతో కార్పొరేట్ దవాఖానలలో ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. రాయదుర్గం ప్రాంతాలకు చెందిన బేబిఆఫ్ ఆనమ్ ఫాతీమాకు సీఎం సహాయ నిధి పథకం కింద మంజూరైన రూ.75వేల ఆర్థిక సాయం మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం తన నిరంతర సేవల ద్వారా బాధిత పేద ప్రజలకు కొండంత అండనిస్తున్నదన్నారు. పేదరికంతో ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కావొద్దన్న లక్ష్యంతో సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక తోడ్పాటును అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆపదలో ఉన్న వారికి ఇది ఆపన్న హస్తం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 5: కష్టాల్లో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అల్లాపూర్ డివిజన్ సప్లర్‌నగర్‌కు చెందిన ఫాతియాబేగంకు 1 లక్ష రూపాయల సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ కమిషనర్ జోయెల్ డేవిస్

దుండిగల్,జూలై 5: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి, సూరారం, శివాలయనగర్‌లోని జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ కమిషనర్ జోయెల్ డేవిస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఆయన సీఐ శ్రీనివాస్‌తో సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలకు వెనుకాడొద్దని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు.

దివ్యజ్యోతి ఆడియోస్ అధ్వర్యంలో గురుస్వామి ముత్యంరెడ్డి రూపొందించిన శబరిమల మహాపాదయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తదితరులు.

– శేరిలింగంపల్లి, జూలై 5

ఇటీవల హజ్ యాత్ర పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం దంపతులు శుక్రవారం ఎమ్మెల్యే మాధరం కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, పెండింగ్‌లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. – అల్లాపూర్, జూలై 5

అభయాంజనేయ స్వామి ఆలయం వార్షికోత్సవం

దుండిగల్, జూలై 5: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, చర్చ్ గాగిల్లాపూర్‌లోని చైతన్య కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం 6వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంకర్ నాయక్, మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి,కుంటి నాగరాజు, జక్కుల శ్రీనివాస్ యాదవ్, బొరంపేట్ పీఏసీఎస్ డైరెక్టర్ జీతయ్య, నాయకులు మొర అశోక్, కొర్ర రవీందర్ నాయక్, శ్రీనివాస్, నరేందర్ నాయక్, మల్లేశ్, శివ నాయక్, కాలనీ సభ్యులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌కృష్ణను ఆయన కార్యాలయం వద్ద శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా,ఆయన స్పందించారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన అన్నదానంలో పాల్గొన్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తదితరులు

ద్విచక్ర వాహనాల దొంగ రిమాండ్

పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

కుత్బుల్లాపూర్, జూలై 5: జల్సాల కోసం ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి తప్పించుకొని తిరుగుతున్న ఓ నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. సీఐ విజయ్‌వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ మండలంలోని రాజ్‌పేట్ గ్రామానికి చెందిన బోళ్ల నవీన్(20) గత కొన్నేండ్ల కిందట నగరానికి వలస వచ్చి పేట్‌బషీరాబాద్‌లోని అంగడిపేట్‌లో ఉంటూ జులాయిగా తిరుగుతుంటాడు. కాగా, రోజువారి ఖర్చుల కోసం, జల్సాల కోసం దొంగతనాల బాటను ఎంచుకున్నాడు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇతర బహిరంగ ప్రాంతాల్లో పెద్దఎత్తున పార్కింగ్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి తక్కువ ధరలకు బయట అమ్ముకుంటూ తన అవసరాలను తీర్చుకుంటున్నాడు. కాగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వచ్చిన పలు ద్విచక్రవాహనాల దొంగతనాల ఫిర్యాదులతో పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. తమ విచారణలో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ద్విచక్ర వాహనాలను రికవరీ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును చేజిక్కించిన సీఐ కె.విజయ్‌వర్ధన్‌తోపాటు డిఐ నర్సింహారాజు, డీఎస్ఐ సి.నర్సింలు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, క్రైమ్ సిబ్బంది పి.రాజేందర్, రవికిశోర్, కానిస్టేబుళ్ల గణపతి, కిశోర్‌రెడ్డి, విజయలక్ష్మిలను మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి, పేట్ బషీరాబాద్ డివిజన్ ఏసీపీ కె.రాములు అభినందించారు.

హాస్టల్ వర్కర్ల జీతాలు వర్సిటీయే చెల్లించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 5 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలోని హాస్టల్స్‌లో వర్కర్స్ జీతాలు వర్సిటీయే చెల్లించాలని, వర్కర్ల జీతాల భారం విద్యార్థులపై వేయడం తగదని కోరుతూ శుక్రవారం వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డికి విద్యార్థి జేఏసీ, బంజారా విద్యార్థి సంఘాల నేతలు బోట్ల భిక్షపతి, దరావత్ వినోద్‌నాయక్ వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ... వర్సిటీ హాస్టల్స్‌లో పని చేస్తున్న వర్కర్ల జీతాలు విద్యార్థులపై వేయడం తగదని, గతంలో పలుమార్లు ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. విద్యార్థుల ఫీజును రూ.340 నుంచి రూ.415కు పెంచడంతో విద్యార్థులపై అదనపు భారం పడుతుందన్నారు. విద్యార్థి సంఘం నాయకులు ఆకాశ్‌నాయక్, సురేశ్, విష్ణు, అఖిల్, హనుమంత్, వినయ్, చక్రవర్తి, ప్రమోద్, గణేశ్, నరేశ్, విద్యార్థులు ఉన్నారు.

రూల్స్ పాటించి..సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలి

కుత్బుల్లాపూర్, జూలై 5: రోడ్డుపై వాహనాలు నడుపుతున్న క్రమంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ ఎ.నాగరాజు సూచించారు. శుక్రవారం సుచిత్రలోని పలు షాపింగ్‌మాల్స్ సిబ్బంది, నిర్వాహకులకు ట్రాఫిక్ నియమనిబంధనలతోపాటు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా హెల్మెట్‌లేని వారే మరణిస్తున్నారని, ద్విచక్ర వాహనాదారులు తలకు హెల్మెట్ వాడాలని, కారు నడిపే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. యూటర్న్ వద్దనే వాహనాలను తిప్పుకోవాలని, షార్ట్‌కట్‌లో వెళితే ప్రమాదాలు తప్పవని హెచ్చరించారు. రాంగ్‌రూట్ డ్రైవింగ్‌లతో ఎదుటి వారి ప్రాణాలతో చెలగాటం ఆడరాదని, అందరూ నిబంధనలు పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి చలాన్లు వేసి పంపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.శ్యామ్‌బాబు తదితరులు ఉన్నారు.

నీళ్లు పట్టుకున్నాడని.. మట్టు పెట్టారు

మియాపూర్, జూలై 5: హోటల్‌లోకి వచ్చి అడుగకుండా బాటిల్‌లో మంచినీళ్లు పట్టుకున్నాడన్న కోపంతో ఓ కూలీని ఆ హోటల్ కార్మికులు చితకబాదారు. దీంతో కార్మికుల దెబ్బలతో అప స్మారక స్థితిలోకి వెళ్లిన కూలి మరణించాడు. ఈ ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మియాపూర్ పోలీసులు, మృతుడి కుటుంబసభ్యుల వివరాల మేరకు.. టెక్‌మాల్ మండలం బోడగట్టుకు చెందిన చాకలి సాయిలు (33) భార్య, ఇద్దరు కుమారులతో కలిసి బీరంగూడలో నివాసముంటున్నాడు. రోజువారీ కూలీగా పనిచేస్తున్న సాయిలు.. శుక్రవారం తెల్లవారు జామున 4గంటల సమయంలో మియాపూర్‌లోని పాత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇసుక అన్‌లోడ్ చేసే పనులకు వెళ్లాడు. దాహంగా ఉండటంతో సమీపంలో ఉన్న ఓ చాయ్ హోటల్‌కు వెళ్లి..అక్కడ బాటిల్‌లో నీరు పట్టుకున్నాడు. అడగకుండా నీరు పట్టుకున్నాడనే కోపంతో ఆ దుకాణం నిర్వాహకుడు సాయిలును మందలించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. హోటల్ కార్మికుడు సతీశ్, మరో ఇద్దరు స్నేహితులతో కలిసి సాయిలుపై దాడికి పాల్పడటంతో అతడు సృహతప్పి అక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మియాపూర్ సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపారు. దాడికి పాల్పడ్డ సతీశ్‌తోపాటు అతడి ఇద్దరు స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హోటల్ కార్మికులు నీటి విషయంలో కూలీని చంపారన్న వార్తతో తోటి కూలీలు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అక్రమ నిర్మాణాలపై సీపీఐ ఫిర్యాదు

బాచుపల్లి తాసీల్దార్ పూల్‌సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

దుండిగల్, జూలై 5:బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్,బాచుపల్లి గ్రామాలలోని సర్వే నంబర్ 82, 93, 95, 186, 191, 344 తదితర ప్రభుత్వ భూముల ఆక్రమణ, వాటిల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్‌ను కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 82, 93, 95లో జరుగుతున్న కబ్జాలు జరుగుతున్నాయని, అదే విధంగా గ్రీన్‌ఫీల్డ్‌కు వెళ్లే దారిలో కొంతమంది కబ్జాదారులు తప్పుడు పత్రాలతో అక్రమ నిర్మాణాలు చేపట్టారని అన్నారు. అలాగే సర్వే నంబర్ 344 చెరువు శిఖం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నంబర్ 90, 94 పత్రాలతో సర్వే నంబర్ 191లో కబ్జా చేసి బహుళ అంతస్తులు, అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్నాని వాటిపైనా తగిన చర్యలు తీసుకోవాలని తాసీల్దార్‌ను కోరామన్నారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అశి యాదయ్య, కే.మల్లయ్య, సీహెచ్.యాదగిరి పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి

పట్నం సునీతామహేందర్‌రెడ్డి దంపతులకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న శేరి సతీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 5: నిరంతరం ప్రజా సేవలో ఉంటానని, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించేలా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పట్నం సునీతామహేందర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పదవీ విరమణ చేసిన పట్నం సునీతామహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిలకు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని పుష్ప గుచ్ఛాన్ని అందించి శాలువాలతో సన్మానించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఆమె అందించిన సేవలతో ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లేసి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, దిండి అరవింద్‌రెడ్డి, సంజీవరావు, మేఖల మైకల్, చున్నుపాషా, అబ్దుల్‌బాకీ, పొడుగు అప్పారావు, నాగమల్లేశ్వర్‌రావు, రేష్మా, సంధ్యారాణి, పద్మ, సుందరి, రేణుక, యమునా, ఫణీంద్రా, రంగస్వామి, మధు, రాజు, బాబు, శేషగిరిరావు, రాము, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

కుమారి ఆంటీ ఫుడ్‌స్టాల్‌ను సందర్శించిన సినీనటుడు సోనూసూద్

ట్విట్టర్ ఖాతా ద్వారా వెల్లడి

కొండాపూర్, జూలై 5 : సామాజిక మాధ్యమాల ద్వారా అతి తక్కువ సమయంలో పాపులారిటీ సంపాదించుకున్న కుమారి ఆంటీ ఫుడ్‌స్టాల్‌ను ప్రముఖ సినీ నటుడు, సామాజికవేత్త సోనూసూద్ సందర్శించి కుమారి ఆంటీ వ్యాపారం.. బాగోగులను అడిగి తెలుసుకుంటున్న వీడియోను ట్విట్టర్ ఖాతా ద్వారా వెల్లడించాడు. కుమారి ఆంటీ ఫుడ్‌స్టాల్‌ను సందర్శించిన వీడియోను సోనూసూద్ స్వయంగా పోస్టు చేశాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా వైరల్‌గా మారింది. ఇటీవలె నగరానికి విచ్చేసిన సోనూ, ఐటీసీ కోహినూర్ హోటల్ సర్వీస్ రోడ్డులో ఉన్న కుమారి ఆంటీ స్ట్రీట్ ఫుడ్ స్టాల్‌ను సందర్శించారు. కాసేపు ఆమెతో మాట్లాడిన అనంతరం.. 'తాను వెజిటేరియన్ ఫుడ్ తింటానని, తనకు డిస్కౌంట్ ఇస్తారా? అని అడగడంతో, మీకు ఫ్రీగానే ఇస్తాను' అంటూ కుమారి ఆంటీ సమాధానం ఇచ్చింది. కరోనా టైంలో ఎంతో మందికి సహాయం చేసిన మీకు ఏమిచ్చినా తక్కువేనని ఆంటీ తెలిపింది. దీంతో సోనూసూద్ తన ట్విట్టర్ అకౌంట్‌లో కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్‌ను సందర్శించిన వీడియో పోస్టు చేసి.. ఆంటీ స్త్రీ శక్తికి నిదర్శనమని, కష్టపడితే ఫలితం ఉంటుందనడానికి ఈవిడే నిదర్శనమని రాసుకొచ్చాడు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

మనీదీప్ తీవారి

భూక్యా నితిన్

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 5: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి.. బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి అభినందించాడు. పాఠశాలలో 2023-24 సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను సాధించిన మనీదీప్ తీవారి, భూక్యా నితిన్‌లు.. ఇటీవల విడుదలైన ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షల్లో సైతం ఉన్నతంగా రాణించారన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో మనీదీప్ తీవారి, భూక్యా నితిన్‌లు సీటు సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, బోధించిన ఉపాధ్యాయులకు గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదగాలని ఉపాధ్యాయులు ఆశీర్వదించగా.. తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రిషి మహిళా కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శంషీగూడ ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా వలంటీర్లు శ్రమదానం చేసి పాఠశాల ఆవరణలోని మైదానంలో పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించారు. విద్యార్థులకు సామాజిక అంశాలపై తరగతులను బోధించారు. ఉన్నత విద్యపై వలంటీర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రాజశ్రీ మాట్లాడుతూ.. ఇలాంటి ఎన్ఎస్ఎస్ క్యాంపుల ద్వారా సమాజానికి తగు సేవ చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ జ్యోతి, వలంటీర్లు పాల్గొన్నారు. – మియాపూర్, జూలై 5

డ్రైనేజీ పనులు నాణ్యతతో చేపట్టాలి



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కమలమ్మ కాలనీలో యూజీడీ నిర్మాణ పనులను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీడీ నిర్మాణానికి నిధులు మంజూరైనందున పనులను ప్రారంభించామన్నారు. నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ వెంకటేశ్ కోరారు. పూర్తయిన వెంటనే సీసీ రహదారులను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పాండుగౌడ్, మున్నా, సయద్, వాసు, నాగేశ్వర్‌రావు రాజు, బాలస్వామి, నర్సింహ పాల్గొన్నారు. – మియాపూర్, జూలై 5

ట్రాఫిక్ సిబ్బందికి వీడ్కోలు సన్మానం

కేపీహెచ్‌బీ కాలనీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన సిబ్బందిని ట్రాఫిక్ సీఐ వెంకట్ శాలువాలు, పూలదండలతో సన్మానించి అభినందనలు తెలిపారు. బదిలీపై వెళ్లిన వారిలో ఎస్సై శశిధర్, హెడ్ కానిస్టేబుల్స్ ప్రేమ్‌కుమార్, కలీముద్దీన్, కానిస్టేబుల్స్ అబ్దుల్, సంతోష్, రవీందర్, రాము, శ్రీనివాస్, సలావుద్దీన్‌లు ఉన్నారు. వీరందరి స్థానంలో వివిధ పోలీస్ స్టేషన్‌ల నుంచి ఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. –కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 5

దుర్గామాత ఆలయాభివృద్ధికి కృషి

దుండిగల్, జూలై 5: నిజాంపేట్‌లోని దుర్గామాత ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్)అన్నారు. శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులతో కలిసి గుడి పరిసరాలను, ఆలయం ప్రధాన ద్వారం వద్ద తవ్విన కాలువను పరిశీలించారు. మున్సిపల్ అ